విద్యుత్ సమస్యలు ఉంటే...

చందానగర్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే కింది నంబర్లను సంప్రదించవచ్చని చందానగర్ ఏఈ దీప్తి ఓ ప్రకటనలో తెలిపారు.

- దీప్తి, చందానగర్ ఏఈ : 87124 69634
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ : 87124 69655
- లైన్ ఇన్‌స్పెక్టర్ 1 : 87124 69641 (మదీనాగూడ, వైశాలీనగర్, వినాయక్‌నగర్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, ఏపీజీఓ కాలనీ, సీఎం తోట, మైత్రీనగర్ ఫేజ్ -1,2, శిల్పా గార్డెన్స్, రామకృష్ణనగర్, ఆర్టీసీ కాలనీ)
- లైన్ ఇన్‌స్పెక్టర్ 2 : 87124 69647 (న్యూ హఫీజ్‌పేట్, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్, బి–బ్లాక్, హనీఫ్ కాలనీ, గోపాల్‌రెడ్డి నగర్, గణేష్ టెంపుల్)

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో రూ.19.80 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో రవి, గోపి, ఆంజనేయులు, నారాయణ, చిన్న కన్న, ప్రవీణ్, రవీందర్ రెడ్డి, రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో నిరసన



నిరసనలో పాల్గొన్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, టీఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ బేషరతుగా వెంటనే సోనమ్ వాంగ్‌చుక్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, టీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం .... మంగళవారం నిర్వహించిన డ్రైవ్‌లో ఐదుగురిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి రూ. వెయ్యి, మరో నలుగురికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఐటీ కారిడార్.. ట్రాఫికర్

నాలుగు వైపులా గ్రిడ్ లాక్
గంటల తరబడి రోడ్లపై వాహనదారులు




గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో బుధవారం ట్రాఫిక్ పోటెత్తింది. ఐటీ కారిడార్‌కు వచ్చే రోడ్లు గ్రిడ్‌లాక్ అయ్యాయి. ఎటు చూసినా కిలోమీటర్ పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఆలస్యంగా ఆఫీసులకు చురుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు శ్రమించినా జామ్ తప్పలేదు. ఇదిలావుండగా మంగళవారం కూడా రోడ్లు వాహనాల సంద్రంగా మారాయి.

- ఆర్‌ఓబీ నుంచి సైబర్‌టవర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి.
- బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి ఐకియా వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది
- కొండాపూర్ ఆర్టీఏ ఆఫీస్ నుంచి రాడిసన్ హోటల్ వరకు వాహనాలు బారులుదీరాయి.
- నాన్నకు ప్రేమతో జంక్షన్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు ట్రాఫిక్ జామ్ నెలకొంది.
- మల్కంచెరువు–ఖాజాగూడ జంక్షన్ వరకు రాకపోకలు నిలిచిపోయాయి.
- మాదాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు చర్యలు ఈతీసుకున్నా మధ్యాహ్నం 1 గంట వరకు ట్రాఫిక్ జామ్ తప్పలేదు.

హైబ్రిడ్ విధానంతో అవస్థలు..

కొవిడ్ సమయంలో ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. అనంతరం కొన్ని కంపెనీలు కార్యాలయం నుంచి విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. వర్క్ ఫ్రమ్ హోం విధానానికి అలవాటు పడ్డ ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపకపోవడంతో హైబ్రిడ్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చాయి. ప్రతి సోమ, మంగళ, బుధవారాల్లో తప్పనిసరిగా కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. అంతేకాకుండా షిఫ్ట్ విధానం లేకపోవడంతో ఉదయం ఆఫీస్‌కు వెళ్లేందుకు ఐటీ ఉద్యోగులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఐటీ కారిడార్‌లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఐటీ కంపెనీలు షిఫ్ట్ విధానాన్ని అమలు చేస్తే ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గే అవకాశం ఉంటుంది.







అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు


ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పిఎన్ఆర్ టౌన్‌షిప్‌లో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని బుధవారం జేసీబీతో కూల్చివేశారు. అదేవిధంగా అనుమతులకు మించి నిర్మిస్తున్న వాటి పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... మున్సిపాలిటీ నుండి తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని, అలాకాకుండా పాత పర్మిషన్ల పేరిట ఇష్టారాజ్యంగా నిర్మాణం చేపడితే నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేపడతామన్నారు.



రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న సిబ్బంది

హెచ్‌సీయూలో జింకల సందడి



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జింకలు సందడి చేశాయి. స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లే కొత్త రోడ్డు పక్కన కనిపించాయి .

– రాయదుర్గం

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయదుర్గం: రాయదుర్గం మల్కంచెరువు వద్ద నిర్మించిన కట్టమైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. గురువారం ఉదయం 10.45 గంటలకు గణపతిపూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, శనివారం ఉదయం 6 గంటలకు గణపతిపూజ, మండప పూజ, హోమం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9.05 గంటలకు కట్ట మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తారు. అనంతరం అభిషేకం, అర్చన, హారతి, పూర్ణాహుతి హోమం, నివేదన చేస్తారు. సాయంత్రం 4 గంటలకు బోనాలు ఉంటాయి.

ఉచిత ఆరోగ్య కేంద్రం

చందానగర్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ల లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషెంట్‌కు రూ.30లు చెల్లించాలి. రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు చేస్తారు. ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా ఆరోగ్యం కేంద్రంలో నిర్వహిస్తారు.ఈ కేంద్రానికి సికింద్రాబాద్, మసీద్‌బండ, కొండాపూర్, మార్తాండనగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. ఆదివారం ఆరోగ్య కేంద్రానికి సెలవు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు రాయదుర్గం విద్యార్థులు

రాయదుర్గం: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం వీరిని పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి అభినందించారు. వీరు ఇటీవల జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి టోర్నమెంట్ జిల్లా సెలక్షన్స్–2025 పోటీలలో అండర్– 17, అండర్–14 విభాగంలో పాల్గొన్నారు. ఈ పోటీలలో భానుతేజ అండర్–17లో బంగారు పతకం, అండర్–14లో చరణ్‌తేజ బంగారు పతకం సాధించారు. వరంగల్‌లో 10,11 తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో ఇరువురు పాల్గొనున్నారు.



క్రీడాకారులను సన్మానించిన కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి

ఎఫ్‌డీడీఐ-హెచ్‌లో క్రీడోత్సవాలు

రాయదుర్గం: ఇబ్బిటా–2025 కార్యక్రమంలో భాగంగా రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హెచ్ క్రీడోత్సవాలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో సందడి నెలకొంది. బుధవారం ఎఫ్‌డీడీఐ–హెచ్ క్యాంపస్‌లోని క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్యాకల్టీ–స్టూడెంట్స్ మధ్య పోటీ నిర్వహించారు. ఇందులో ఫ్యాకల్టీ టీమ్ భారీ విజయాన్ని సాధించింది. 20 ఓవర్లలో ఫ్యాకల్టీ జట్టు 175 పరుగులు సాధించారు. ఈ సందర్భంగా ఈడీ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటవిడుపు కోసం ప్రతియేటా ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ ముప్పిడి రాంబాబు, హరిహరన్, డాక్టర్ వికాస్, గౌరబ్‌సింగ్, గోఫ్రాన్, వేణు, నరేష్, సార్థికా, మిశ్రాచ నిరంజన్, పింటూజీ, అంకణ్‌జీ, సుజిత్ రహమాన్, దిలీప్, అభినవ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో ఫ్యాకల్టీ- స్టూడెంట్స్ వాలీబాల్ జట్టు

ప్రవక్త మహ్మద్ జీవితం ప్రేమ సందేశం

రాయదుర్గం: ప్రవక్త మహ్మద్ జీవితం ప్రేమ సందేశమని ప్రముఖ చరిత్రకారుడు ప్రొఫెసర్ రామ్ పునియాని స్పష్టం చేశారు. మనూలో 'శాంతి, సామరస్యం: ఒక మత దృక్పథం' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సమావేశం నగరంలోని హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ స్నేహభావంతో మెలగాలని సూచించారు. వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ విద్య ఐక్యత, మేధో సామరస్యాన్ని ప్రోత్సహించాలన్నారు. అనంతరం 'అంతర్ మత సంభాషణపై దృక్పథాలు' అనే పుస్తకంను విడుదల చేశారు.

ఆధునిక పద్ధతిలో విద్యాబోధన

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు ఏఆర్‌వీఆర్ ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ.ఆర్.వి. ఆర్ కార్యక్రమంలో విద్యార్థులు ఏఐ గురించి తెలుసుకుంటారని తెలిపారు. నేడు ప్రతి విద్యార్థి సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఎంఈఓ పీ.పీ రాథోడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

రోడ్లపై చెత్త లేకుండా చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వి.సింధురెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని కాలనీలలో రోడ్ల పక్కన చెత్త లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వి. సింధు రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ వార్డ్ కార్యాలయంలో ఉప కమిషనర్ సురేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీలలోనీ పార్కులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఉపయోగంలో లేని మొబైల్ టాయిలెట్స్ ను తొలగించాలని అధికారులను కోరారు. వర్షాల కారణంగా రోడ్లపై గుంతలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ సురేష్, డీఈ దేవేందర్, నాయకులు వి.ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో వన్యప్రాణి వారోత్సవాలు



గచ్చిబౌలి: ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాలను బుధవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో నిర్వహించారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు పాలపిట్ట పండుగ, ఇతర కార్యక్రమాలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను బాగస్వాములను చేశారు. చెట్లు, జంతువులు, పక్షులు, పాముల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, వన్యప్రాణి ఫొటోగ్రఫీ పోటీలను, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎకో టూరిజమ్ అసిస్టెంట్ డైరెక్టర్ శిరీష, డీఎం తనూజ, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, అధికారులు సుమన్, వీరకిషోర్, నేచురలిస్ట్ అపరంజని, రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

మియాపూర్ : మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని న్యూ హఫీజ్‌పేట ఆదిత్యనగర్ కాలనీలో షేక్ సత్తార్, భార్య షేక్ సనా ఆఫ్రీన్(27) కుటుంబంతో నివాసముంటున్నారు. సత్తార్ ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో సనా మార్కెట్‌కు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. రాత్రి అయినా రాకపోవడంతో భర్త షేక్ సత్తార్ ఆందోళన చెంది స్నేహితులు, బంధువుల ఇళ్లలో విచారించినా ఫలితం లేకపోవడంతో మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నల్లగండ్ల చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధి నల్లగండ్ల చెరువును హైడ్రా కమిషనర్ ఏ.వీ.రంగనాథ్ బుధవారం పరిశీలించారు. నల్లగండ్ల ముదిరాజ్ సంఘం ఫిర్యాదుతో కమిషనర్ చెరువును పరిశీలించారు. ముఖ్యంగా చెరువు నీరు కలుషితం అవుతున్నాయని, చిన్న అలుగు, పెద్ద అలుగుల వద్ద నుంచి వరద ప్రవాహం, శ్మశాన వాటిక వైపు ఆక్రమణలు తొలగించాలని ఆయనను కోరారు. రంగనాథ్ చెరువు పరిసరాలను పరిశీలించి, వారంలో రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. అదే విధంగా చెరువు ఎఫ్‌టీఎల్‌లో మునిగిపోతున్న భూముల రైతులు కూడా హైడ్రా కమిషనర్‌ను కలిసి భూములకు టీడీఆర్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నల్లగండ్ల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

పనులు నత్తనడకన..

- వరదనీటి కాల్వ, సీసీ రోడ్డు పనులు ప్రారంభం నాటి నుంచి సాగుతున్న వైనం
- నెలల తరబడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మియాపూర్ : అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రజల పాలిట శాపంగా మారింది. సకాలంలో పూర్తి చేయాల్సిన పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నెలల తరబడి కొనసాగుతున్నాయి. రోడ్లను తవ్వి పనులు మధ్యలో ఆపివేయడం, రోడ్లకు అడ్డంగా మట్టిపోయడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నెలల తరబడి పనులు సాగుతూ ఉండడంపై స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- చందానగర్ డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ నుండి ఎంఏనగర్ వెళ్లే రోడ్డులో వరద నీటి కాల్వ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని రోజులు పనులు చేసి తదనంతరం వదిలేస్తున్నారు. పనుల నేపథ్యంలో కాలనీలోని ప్రధాన రహదారిపై పెద్దపెద్ద మట్టికుప్పలు నాలా, సీసీ రోడ్డు పనుల నిమిత్తం తవ్విన గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇలా తవ్వి వదిలేయడంతో వాహనదారులు, స్థానిక ప్రజల ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి.
- శాంతినగర్ కాలనీ నుండి ఎంఏనగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో వరదనీటి కాల్వ పనులు, సీసీ రోడ్డు పనుల నిమిత్తం 6 నెలల కిందట శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభంలో జాప్యం కారణంగా వర్షాకాలం ప్రారంభంలో మొదలు పెట్టారు. పనులు చేపట్టిన నాటి నుండి నత్తనడకన జరుగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో పనులు చేపట్టడంతో రోడ్డంతా బురదమయంగా మారింది.కాలనీ ప్రధాన రహదారి కావడంతో కాలనీవాసులు బురదతో ఇబ్బంది పడ్డారు. పనులు ఎపుడు పూర్తవుతాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రధాన రహదారి వెంబడి సీసీ రోడ్డు పనుల నిమిత్తం తవ్విన గుంతలు, నాల నిర్మాణం కోసం తవ్విన గుంతలు, రోడ్డుపై పెద్దపెద్ద మట్టి కుప్పలు ఉండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.
- చందానగర్, దీప్తీశ్రీనగర్, శాంతినగర్ మీదుగా ఈ రోడ్డు వెంబడే కృషినగర్, ఎంఏనగర్, జేపీఎన్‌నగర్‌తో పాటు ప్రశాంత్‌నగర్, బొల్లారం, బాచుపల్లి, నిజాంపేట తదితర ప్రాంతాలకు ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు,ఇతరులు అధిక సంఖ్యలో రాకపోకలు చేస్తుంటారు. ఈ రోడ్డు వెంబడి సుమారు 4 నెలలుగా రాకపోకలు నిలిచిపోయాయి. – చందానగర్ నుండి ఈ రోడ్డు వెంబడి వెళ్లే ప్రయాణికులందరూ మదీనగూడ, మియాపూర్ జాతీయ రహదారిపై నుండి వెళ్లాల్సి వస్తుంది. ఇక జాతీయ రహదారి పక్కన బాక్స్ కల్వర్టు పనులు చేపట్టడంతో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో వాహనదారులు జాతీయ రహదారిపై వెళ్లాలంటే భయపడుతున్నారు.
- అధికారులు స్పందించి సీసీ రోడ్డు ,వరదనీటి కాల్వ పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



దీప్తీశ్రీనగర్ కాలనీ- ఎంఏనగర్ కాలనీ రోడ్డును తవ్విన దృశ్యాలు



పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్డు



రోడ్డు పక్కన భారీ మట్టి కుప్ప

